క్లుప్తంగా

సారా నిర్మూలనపై అవగాహన ర్యాలీ



కామనగరువులో ర్యాలీ చేస్తున్న ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు

అమలాపురం రూరల్: నవోదయం 2.0 పేరిట సారా నిర్మూలన కోసం ఎక్సైజ్ శాఖ ప్రచారం చేపట్టింది. దీనిలో భాగంగా గురువారం అమలాపురం రూరల్ మండలం కామనగరువు, చిందాడగరువు, తాండవపల్లి, సమనస, రెడ్డిపల్లి గ్రామాల్లో ప్రచార రథంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎక్సైజ్ పోలీసులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. సారా తాగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. ఎక్సైజ్ శాఖ సీఐ ఈవీవీ సత్యనారాయణ, ఎస్ఐలు, సచివాలయం మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

అమలాపురం టౌన్: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా (జేసీఐ) అమలాపురం శాఖ, సార్వి స్మైల్ డెంటల్ అండ్ ఇంప్లాంట్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక జీవీ మాల్ పని చేసే దాదాపు 200 మందికి ఉచితంగా దంత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ దంత సంరక్షణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జేసీఐ అమలాపురం శాఖ అధ్యక్షురాలు వాడ్రేవు శ్రీవాణి, కార్యదర్శి ప్రవీణ్, జీవీ మాల్ మేనేజర్ పూర్ణచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో ఆర్డీఓ తనిఖీలు



ముమ్మిడివరంలో అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి తదితరులు

ముమ్మిడివరం: పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను అమలాపురం ఆర్డీఓ కె.మాధవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో టోకెన్ కౌంటర్, తాగునీరు, ప్లేట్లు పరిశుభ్రతలను పరిశీలించారు. మంచి ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో పేదలకు సేవా దృక్పథంతో ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. క్యాంటీన్‌లో మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. భోజనం చేయడానికి వచ్చిన ఆటో, రిక్షా కార్మికులు, పేదలతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బలక్ష్మి, కమిషనర్ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని చింతలమెరకలో రామాలయం ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారికి దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

పసుపు రంగు రేషన్ కార్డుదారులకూ ఆర్థిక సాయం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న పసుపురంగు రేషన్‌కార్డు కుటుంబాలకు సైతం రూ.1000 ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు సీఎం రంగసామి ప్రకటించారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో పై విధంగా సమాధానమిచ్చారు. ప్రజలపై భారం పడకుండా దశలవారీగా పన్నులు పెంచి ఆదాయాన్ని పెంచినట్లు తెలిపారు. అలాగే పీడబ్ల్యూడీ శాఖ పరంగా పలు పనులు నిర్మాణంలో ఉన్నాయని, ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గానికి ఇచ్చే అభివృద్ధి నిధులు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లకు పెంచినట్లు తెలిపారు. విద్యార్థుల ఫీజులు సైతం చెల్లించామన్నారు. త్వరలో ఏర్పాటు చేసే స్పెషల్ ఎకనామిక్ జోన్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. ఎరుపు రంగు కార్డు దారులకు నెలకు రూ.2,500 సహాయం, పసుపురంగు రేషన్‌కార్డు దారులకు రూ.1000 సాయం ఇస్తున్నట్లు ప్రకటించారు.

భవిత కేంద్రం పరిశీలన

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని విద్యాశాఖ సీఎంఓ బోరుసు వెంకట సుబ్రహ్మణ్యం, ఎంఈఓ-2 ఎస్.సత్యకృష్ణ గురువారం పరిశీలించారు. భవిత కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భవిత టీచర్లు సీహెచ్ గంగాదేవి సి.జి.వి.దివ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ రాజుకు పరామర్శ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును పలువురు గురువారం పరామర్శించారు. డీవైఈఓ గుబ్బల సూర్యప్రకాశంతోపాటు పలువురి ప్రధానోపాధ్యాయులు కమిషనర్‌ను ఆయన క్వార్టర్స్‌లో కలిసి సంతాపం తెలిపారు.

50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగే లక్ష్యం



కన్వర్జెన్సీ సమావేశంలో మాట్లాడుతున్న బోసుబాబు

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అల్లవరం: రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయం, డీఆర్‌డీఏ సంయుక్తంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు సూచించారు. అల్లవరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించేందుకు విచక్షణారహితంగా పురుగు మందులు, ఎరువులు వినియోగించడంతో భూసారం పూర్తిగా క్షీణిస్తుందన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి ప్రకృతి సేద్యాన్ని రైతులు అనుసరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఏఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ సహజ సిద్ధంగా తయారుచేసిన ఘన జీవామృతం, కషాయాలతోనే నాణ్యమైన దిగుబడులు సాధ్యమన్నారు. 365 రోజుల పాటు భూమిని కప్పే విధంగా పంటలు వేయాలన్నారు. దానికి అనుగుణంగా 31 రకాల విత్తనాలు భూమిపై చల్లడంతో పాటు ఏపుగా పెరిగిన పైరుని కలియ దున్నడంతో భూసారం పెరుగుతుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించేలా చైతన్యం తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ షంషీ, ఏడీఏ రాజశేఖర్, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ప్రకృతి వ్యవసాయ ఎన్‌ఎఫ్‌ఏ హేమలత, రాధిక, ప్రసాద్, ఏఈఓ శుభ గణేష్, ట్రైనర్ సూరిబాబు, ఇన్‌చార్జ్ ఎన్‌ఎఫ్ పాటి సింహాద్రి, వీవీఏలు, వీఓఏలు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయేల్, సేవాదళ్ జిల్లా కార్యదర్శి రమణ



మాజీ సీఎం జగన్‌ను కలసిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ధనుష్

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్ సమక్షంలో పార్టీ సేవాదళ్ జిల్లా కార్యదర్శి పెయ్యిల రమణ జగన్‌ను కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ సీఎం జగన్ తమకు సూచించినట్టు రమణ తెలిపారు.

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. తన కుమారుడు ధనుష్‌తో కలసి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తండ్రీ కొడుకులు శ్రీనివాసరావు, ధనుష్ వైఎస్ జగన్‌ను సత్కరించి బొకే అందించారు.

ఆటో కార్మికుల ఉపాధిపై ముప్పేట దాడి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సత్తిరాజు

అమలాపురం రూరల్: ఆటో కార్మికుల ఉపాధిపై ముప్పేట దాడి జరుగుతోందని, సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటం చేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు పిలుపునిచ్చారు. ఆంధ్ర ఆటోవాలా యూనియన్ జనరల్ బాడీ సమావేశం అమలాపురం మండలం నడిపూడి కెనాల్ రోడ్డులోని ఆటో యూనిట్ యూనియన్ కార్యాలయంలో గురువారం సంఘ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం, కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన రవాణా చట్టం, అధికంగా పెనాల్టీలు విధించడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సత్తిరాజు మాట్లాడుతూ ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇవ్వకపోవడంతో అసంఘటిత కార్మికులు ఆర్థిక సంక్షోభంలో ఉన్నారన్నారు. గత 20 సంవత్సరాలుగా కోనసీమ జిల్లాలో చట్టబద్ధంగా ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేయలేదన్నారు. ఈ సమస్యలపై ఆందోళన చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బొలిశెట్టి గౌరీశంకర్, ఆంధ్ర ఆటోవాలా జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, బొక్కా మంగరాజు, కామిరెడ్డి చంద్రరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నికలు

ఆంధ్ర ఆటోవాలా యూనియన్ అమలాపురం రూరల్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా గుత్తుల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బాషా రామకృష్ణ, కార్యదర్శిగా మడికి చంద్ర శేఖర్, సంయుక్త కార్యదర్శిగా ఎం.ప్రసాద్, పలువురు సంఘ సభ్యులను ఎన్నుకున్నారు.

'సత్య సాయి' సేవలు అభినందనీయం

- 100 ఉచిత వైద్య శిబిరాలు పూర్తి
- 3 వేల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



సత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అమలాపురం టౌన్: భగవాన్ శ్రీసత్యసాయి శత జయంతి సందర్భంగా అమలాపురం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 100 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. 100వ ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం స్థానిక సూర్యనగర్‌లోని గోపాల కృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి ప్రారంభించి ప్రసంగించారు. సత్యసాయి సేవా సంస్థల అమలాపురం డివిజన్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్‌తో పాటు 30 మంది వైద్యుల బృందం గత రెండు నెలల్లో అమలాపురం డివిజన్‌లో 100 వైద్య శిబిరాలను నిర్వహించడం మంచి పరిణామమని కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాట్లాడుతూ 100 వైద్య శిబిరాల ద్వారా 3 వేల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం సాధారణ విషయం కాదన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, స్థానిక వార్డు కౌన్సిలర్ వాసర్ల లక్ష్మి మాట్లాడుతూ వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు సేవలు అందించడమే కాకుండా వ్యాధి తీవ్రతను బట్టి తమ క్లినిక్‌లకు కొంత మంది విద్యార్థులను రప్పించుకుని వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి వైద్య పరికరాలు అందించడంలో వైద్యులు పోషించిన పాత్ర అభినందనీయమన్నారు. అనంతరం సత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిలా అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, డాక్టర్లు మురళీ, కృష్ణంరాజు, తేజ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలేనికి చెందిన ఓ బాలిక (15) బుధవారం తెల్లవారుజామున అదృశ్యమైంది. బాలిక అగంతకుడితో ఫోన్లో మాట్లాడుతున్న విషయాన్ని తల్లి గమనించి కుమార్తెను మందలించింది. దీంతో మైనర్ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఎస్సై తిరుమలరావు తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాలిక వద్ద ఫోన్ ఆధారంగా విచారణ చేపట్టామని తెలిపారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

ఉప్పలగుప్తం: ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ వీఎస్ దివాకర్ అన్నారు. మండలంలోని భీమనపల్లిలో గురువారం భూముల రీసర్వేపై రైతులకు అవగాహనా కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు దేశంశెట్టి నాగరత్న కుమారి, రీసర్వే డీటీ సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సిబ్బంది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



కాట్రేనికోన గేటు సెంటర్‌లో ఆందోళన చేస్తున్న మాల మహానాడు నాయకులు



ఉప్పలగుప్తంలో తహసీల్దార్ దివాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న మాల మహానాడు నాయకులు

కాట్రేనికోన: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండల మాల మహానాడు నాయకులు గురువారం నిరసన తెలిపారు. కాట్రేనికోన గేటు సెంటర్‌లో మాల మహానాడు నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాట్రేనికోన గేట్ సెంటర్ నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తహసీల్దార్ సునీల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నల్లా నరసింహమూర్తి, జగడం బాలయ్య, ఇసుకపట్ల రాంబాబు, వడ్డి శ్యామ్ ప్రసాద్, గిడ్ల శ్రీను, వరసాల చిన్నారావు, అయితాబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఏకపక్ష నిర్ణయం తగదు

ఉప్పలగుప్తం: ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వానికి ఏకపక్ష నిర్ణయం తగదని మాల మహానాడు నాయకులు ధ్వజమెత్తారు. మండలంలోని ఎన్.కొత్తపల్లిలో ఎస్సీ వర్గీకరణ అంశంపై మాలమహానాడు నాయకులు గురువారం సమావేశమయ్యారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణను ప్రకటిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం తగదని, దానిని వెంటనే వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వీఎస్ దివాకర్‌కు అందించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జనాభా శాతాన్ని చూడకుండా ఏకపక్ష నిర్ణయాలను తీసుకోవడం తగదని, అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. మాల మహానాడు మండల అధ్యక్షుడు కొంకి వెంకట బాబ్జి, కుంచే బాబులు, నాతి శ్రీనువాసరావు, కొంకి బాలకృష్ణ, మాకే విజమ్, పోతుల సత్యనారాయణ, దేవరపల్లి వెంకటేశ్వరరావు, దేవరపల్లి రాంబాబు, మాకే కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును వేగవంతం చేయాలి



పి.మల్లవరం ప్రకృతి సాగు క్షేత్రంలో వరిచేలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్ తదితరులు

తాళ్లరేవు: రైతులకు సంక్షేమ పథకాలు అందించేందుకు గాను ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫార్మర్స్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.విజయ్‌కుమార్ ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని జి.వేమవరం, పి.మల్లవరం గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తాళ్లరేవు మండలం వెనుకబడిందని, త్వరితగతిన నూరు శాతం పూర్తి చేయాలన్నారు. రైతులకు వ్యవసాయ పరికరాలను అందించేందుకు జిల్లాకు 3.92 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. 80 శాతం సబ్సిడీతో మండలానికి ఒక డ్రోన్‌ను అందజేయనున్నట్లు చెప్పారు. రైతులు గతంలో మాదిరిగా మూడో పంటలో అపరాలు వేయాలని కోరారు. దీనివల్ల భూసారం పెరగడంతోపాటు రైతులకు ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం కృషి అమృత్ గోవు ఆధారిత వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. రైతులు డి.వెంకటరమణ, డి.సత్తికొండలు సాగుచేస్తున్న నాటు విత్తనాలు రక్తశాలి, కుజిపటాలియా, ఆర్‌యస్ఆర్ పంటచేలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ బాబూరావు, గ్రామ సర్పంచ్ పంపన రామకృష్ణ, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ డి.నాగేంద్రప్రసాద్, గంజా కాశీ విశ్వనాథ్, విల్ల సత్యనారాయణ వీఏఏలు అజయ్, గీతాంజలి, సుధ పాల్గొన్నారు.

కుళాయి అక్రమ కనెక్షన్ల తొలగింపు



కాట్రేనికోన పంచాయతీ జిల్లేళవారిపేటలో అక్రమ కనెక్షన్లు తొలగిస్తున్న దృశ్యం

కాట్రేనికోన: స్థానిక పంచాయతీ పరిధిలోని నడవపల్లి మంచి నీటి ప్రాజెక్టు నుంచి గచ్చకాయలపోర వెళుతున్న ప్రధాన పైప్‌లైన్‌పై ఉన్న అక్రమ కుళాయి కనెక్షన్లను తొలగించేందుకు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. మంచి నీటి ప్రాజెక్టు నుంచి సరఫరా చేస్తున్న ప్రధాన పైప్‌లైన్‌పై ఉన్న అక్రమ కుళాయి కనెక్షన్ల కారణంగా శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదని గచ్చకాయలపోర, చిర్రయానం గ్రామ పెద్దలు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు గచ్చకాయలపోర, చిర్రయానం గ్రామ పెద్దలతో కలసి అక్రమ కుళాయి కనెక్షన్ల తొలగింపు పనులు ప్రారంభించారు. వేట్లపాలెం, జిల్లేళవారి పేట, కాట్రేనికోన బ్రహ్మన్న చెరువు వరకు అక్రమ కుళాయి కనెక్షన్లను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి సంగాని మునేంద్ర వర్మ, అంగాని నరసింహమూర్తి, బొమ్మిడి సూరిబాబు, సంగాని సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పెళింగి రంగారావు వర్మ, గచ్చకాయపోర, చిర్రయానం గ్రామ పెద్దలు, కార్యదర్శి జె.సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రమణ్యం, తదితరులు ఉన్నారు.

మిల్క్ బాయిలర్స్‌కు వేతనాల పెంపు



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న సంఘం అధ్యక్షుడు మారన్, చిత్రంలో హోంమంత్రి నమశ్శివాయం

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాజీవ్ గాంధీ బ్రేక్ ఫాస్ట్ పథకం ద్వారా విద్యార్థులకు పాలు కాచి పంపిణీ చేస్తున్న సిబ్బందికి (మిల్క్ బాయిలర్స్) వేతనాలు పెంచారు. మిల్క్ బాయిలర్స్ వేతనాలను రూ.8 వేల నుంచి రూ.18 వేలకు పెంచుతూ విడుదల చేసిన జీవోను గురువారం సీఎం రంగసామి చేతుల మీదుగా వారికి అందజేసినట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. కాగా మిల్క్‌బాయిలర్స్ వేతనాల పెంపు డిమాండ్ సాధన కోసం గత నాలుగేళ్లుగా చేస్తున్న పోరాటానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అందించిన సహకారం మరువలేనిదని పుదుచ్చేరి రాష్ట్ర మిల్క్ బాయిలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారన్ పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హోమ్‌మంత్రి నమశ్శివాయం, కల్యాణసుందరం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ ప్రారంభం



నీలపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

తాళ్లరేవు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ్ భి, పడాయి భి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా తరగతులను చొల్లంగి, నీలపల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో నిర్వహిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో 40 మంది చొప్పున శిక్షణ పొందుతున్నారు. తొలిరోజు జాతీయ విద్యా విధానం, జాతీయ పాఠ్య ప్రణాళిక, నవచేతన, ఆధార్ శిల తదితర అంశాలను వివరించారు. పోషణ్ 2.0లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ వి.మాధవి తెలిపారు. శిక్షణా తరగతులను విస్తరణాధికారులు లలితా నిర్మల, నిభావాణి, సత్యనళిని, కె.రమణి పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థుల ఫీల్డ్ విజిట్



బండారులంకలో చేనేత మహిళలతో ఫారిన్ ట్రేడ్ కళాశాల విద్యార్థులు

అమలాపురం రూరల్: కాకినాడలో ప్రోగ్రాం డైరెక్టర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు నాన్ రెసిడెన్షియల్ ఫీల్డ్ ఇమర్షన్ శిక్షణలో భాగంగా గురువారం బండారులంకలో ఫీల్డ్ విజిట్ చేశారు. స్వయం సహాయక సంఘం సభ్యులు బ్యాంకు నుంచి రుణం, శ్రీనిధి, సీఐఎఫ్ రుణాలతో చేపట్టిన చేనేత వస్త్రాల తయారీని పరిశీలించారు. చేనేత రంగంలో ఉపాధి, తదితర అంశాలను చేనేత సంఘం నాయకుడు చింతా శంకరమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 25 మంది విద్యార్థులను చేనేత వస్త్రాలతో శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, మాజీ ఎంపీటీసీ మాడ మాధవి తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎంపీడీవో బాబ్జి రాజు, వెలుగు ఏపీఎం సురేంద్ర, సీసీలు రమేష్,దుర్గ కుమారి తదితరులు పాల్గొన్నారు.

18 మోటార్ బైక్‌ల సీజ్



అమలాపురం కిమ్స్ కళాశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

అమలాపురం రూరల్: అమలాపురంలోని కిమ్స్ మెడికల్ కాలేజీ వద్ద రవాణాశాఖ అధికారులు గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 18 మంది మెడికల్ కాలేజీ విద్యార్థుల మోటార్ బైక్‌లు సీజ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, బైక్‌పై కాలేజీకి వచ్చే ప్రతి విద్యార్థి విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీటీఓ డి.శ్రీనివాసరావు సూచించారు. రహదారి భద్రత విషయంలో ఉపేక్షించేది లేదని, అవసరమైతే తల్లితండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. త్వరలోనే రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్లు కాశీ విశ్వేశ్వరరావు, కౌశిక్ పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



బాపనపల్లి వద్ద ఏర్పాటు చేసిన మోటార్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ పోచారావు తదితరులు

తాళ్లరేవు: శివారు ప్రాంతాలకు సాగునీటి ఎద్దడి నేపథ్యంలో నీటిని ఎత్తిపోతల ద్వారా సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. బాపనపల్లి సమీపంలో ఆత్రేయ గోదావరి చెంతన ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను ఇరిగేషన్ డీఈ పోచారావు పరిశీలించారు. శివారు ప్రాంతాలలోని ప్రతి ఎకరాకూ సాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ అనూష, నీటి సంఘం అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

గుండె పోటుతో మాజీ ఫిలిం డిస్ట్రిబ్యూటర్ మృతి



ఆకుల రాము (ఫైల్ ఫొటో)

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన మాజీ ఫిలిం డిస్ట్రిబ్యూటర్, గీతా ఫిలిమ్స్ రిప్రజెంటేటివ్ ఆకుల రాము (60) గురువారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. రాము గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఫిలిం డిస్ట్రిబ్యూటర్‌గా ఎన్నో సినిమాలు కొనుగోలు చేసి థియేటర్లలో ప్రదర్శించారు. వెంకట సాయి ఫిలిమ్స్ పేరుతో ఓ సంస్థను స్థాపించి దాని ద్వారా ఫిలిం డిస్ట్రిబ్యూటర్‌గా పని చేశారు. ప్రస్తుతం అమలాపురంలో గీతా ఫిలిమ్స్ రిప్రజెంటేటివ్ పని చేస్తున్నారు. అమలాపురంలోని సినిమా థియేటర్స్‌తో ఆయనకు దశాబ్దాల అనుబంధం ఉంది. సినీ పరిశ్రమకు రాము సుపరిచతుడు. ఆయన పలు చిత్రాల్లో చిన్న పాత్రల్లో నటించారు. సినిమా డిస్ట్రిబ్యూషన్ రంగంలో రాముకు 40 ఏళ్ల అనుభవం ఉండడంతో కోనసీమ వ్యాప్తంగా సినీ అభిమానులకు సైతం సుపరిచితుడు. రాముకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామ మరణ వార్త వినగానే అమలాపురంలోని సినిమా థియేటర్ల యజమానులు, సినిమా ఏజెంట్లు, పలువురు ఫిలిం డిస్ట్రిబ్యూటర్ల సిబ్బంది ఆయన ఇంటికి వెళ్లి సంతాపం తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

యానాం: స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రొఫెసర్ కె.కృష్ణమోహన్ వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు.

పదోన్నతి కల్పించాలని వినతి

అమలాపురం రూరల్: డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోలకు రెవెన్యూ, ఇతర శాఖల్లో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని కోనసీమ వీఆర్వోల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు అమలాపురం కలెక్టరేట్‌లో గురువారం డీఆర్ఓ రాజకుమారికి వినతిపత్రం సమర్పించారు. సచివాలయాల రేషనలైజేషన్ నిర్ణయానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వీఆర్వోల సంఘ నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, పి.నర్సింహారావు, రాము, కోమలి, సత్యవతి, ధర్మ, సనీల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

ఉప్పలగుప్తం: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయాలని జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని సన్నవిల్లిలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి అరవింద్ కుమార్ నివాసంలో గురువారం మండల స్థాయి కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ మండల స్థాయి కమిటీలు, సభ్యత్వాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నల్లా సత్తిబాబు, జోగయ్యనాయుడు పాల్గొన్నారు.